



మదిలోని ప్రేమ నీదే మాధవుడా..

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా.. ముకుందా.. ముకుందా.. బుడిబుడి అడుగులతో మా ఇంటికి వచ్చి మా చేతి వెన్న ముద్ద తినిపోవయ్య అంటూ చిన్ని కృష్ణుడిని తలచుకుని ప్రజలు వేడుకున్నారు. కుత్బుల్లాపూర్‌లో కృష్ణాష్టమి వేడుకలను పలు పాఠశాలల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలో పాఠశాలలకు పంపించారు. చిన్నారులతో పాఠశాలల్లో ఉట్టి కొట్టించి ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు కేరింతలు కొడుతూ సంతోషంగా గడిపారు. కృష్ణుడి, గోపికల వేషధారణలో ఉన్న చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. – జీడిమెట్ల









క్లుప్తంగా

వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

జగద్గిరిగుట్ట: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని జగద్గిరిగుట్ట సబ్ స్టేషన్ సిబ్బంది కోరారు. ఈనెల8న జగద్గిరి గుట్ట రాజీవ్ గృహకల్పలోని 22వ బ్లాక్ వద్ద, 9న చింతల్‌లోని హనుమాన్ ఆలయం వద్ద, 10న అంజయ్యనగర్ కల్లు కంపౌండ్ వద్ద తమ సిబ్బంది ఉదయం 10గంటల నుంచి అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

కష్టపడి పనిచేస్తే అధికారంలోకి రావడం ఖాయం

కుత్బుల్లాపూర్: కార్యకర్తలు కష్టపడి పని చేస్తే తప్పకుండా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని కర్ణాటక ఎమ్మెల్యే, మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జ్ రిజ్వాన్ అర్షద్ అన్నారు. జీడిమెట్ల సరోజిని గార్డెన్‌లో బుధవారం జరిగిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, సొంటిరెడ్డి పున్నారెడ్డి, జ్యోత్స్నారెడ్డి, కొలను హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానస్పద స్థితిలో నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

దుండిగల్: అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా రాళ్లమడుగు గ్రామానికి చెందిన ప్రసాద్(58) కుటుంబం నగరానికి వలస వచ్చి డి.పోచంపల్లిలోని సర్వే నం.120లో నివాసముంటుంది. ఇతనికి భార్య జ్యోతి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ప్రసాద్ స్థానికంగా ఉన్న ప్రైవేటు పరిశ్రమలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన ప్రసాద్ తరుచూ భార్యతో గొడవపడుతూ ఉండే వాడు. ఇతని వేధింపులు భరించలేక భార్య గొడవ పడి నెల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. మూడు రోజుల క్రితం ఇంటికి వచ్చి చూడగా భర్త కనిపించకపోవడంతో చిన్న కుమార్తెను అడగగా పనికి వెళ్లాడని చెప్పింది.

◆ ఈ క్రమంలో బుధవారం డాక్టర్ బస్తీలో నీటి గుంతలో ఓ వ్యక్తి మృతి చెందాడని తెలుసుకున్న జ్యోతి అక్కడికి వెళ్లి చూడగా తన భర్తేనని గుర్తించింది. అధికంగా మద్యం సేవించే ప్రసాద్ మూడు రోజుల పాటు మద్యం సేవిస్తునే ఉన్నాడని పోలీసులు భావిస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏర్పడ్డ గుంతలో పడి చనిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు. అయితే మృతుడి ఒంటిపై ఎలాంటి దుస్తులు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మృతుడు లుంగీ మాత్రమే ధరించాడని నీటి గుంతలో పడిపోవడంతో అతని ఒంటిపై లేదని పోలీసులు చెబుతున్నారు. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరద ఉధృతిపై మేయర్ సమీక్ష

నిజాంపేట్: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం ఆమె వివిధ విభాగాల అధికారులతో వరద ఉధృతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ.. కొత్తగా నిర్మిస్తున్న భవనాలతో ప్రమాదం పొంచి ఉందన్నారు. తెగిన విద్యుత్ తీగలను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. రోడ్లపై చేరిన నీటిని తరలించే ఏర్పాటు చేయాలన్నారు. ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, విద్యుత్ తదితర శాఖలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం



గాజులరామారం రోడ్డులో పేరుకుపోయిన ఇసుకను తొలగిస్తున్న సర్కిల్ సిబ్బంది



బాచుపల్లిలో ఓ ఇంటి సెల్లార్ నుంచి నీటిని మోటార్ సహాయంతో బయటకు తోడుతూ..

కుత్బుల్లాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు బుధవారం తగ్గుముఖం పట్టింది. దీంతో అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. రోడ్లపై చేరిన వరదనీటిని డ్రెయిన్‌ల ద్వారా తరలించే ఏర్పాట్లు చేశారు. వర్షంతో పలు ప్రాంతాల్లోని రోడ్లు గుంతలమయంగా మారాయి. ఎన్‌డీఆర్‌ఎఫ్, మాన్‌సూన్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. అదే విధంగా రోడ్లపై మేటలు వేసిన ఇసుక, మట్టిని తరలించి రాకపోకలకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. నిజాంపేట్, బాచుపల్లి ప్రాంతాల్లో పలు అపార్ట్‌మెంట్ సెల్లార్లలో చేరిన వరదనీటిని మోటార్లతో బయటకు తోడారు.

◆ బాచుపల్లిలోని కౌసల్య కాలనీలో డ్రైనేజీ మ్యాన్ హోళ్లు ఉప్పొంగడంతో రోడ్లుపై వరదనీరు చేరింది. పత్తికుంట చెరువు నుంచి ఎస్‌ఎల్‌జీ వరకు ఉన్న వరద కాలువను కాలనీ డ్రైనేజీ లైన్‌లో కలపడంతోనే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



జీడిమెట్లలో సహాయక చర్యల్లో పాల్గొన్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది



బాచుపల్లి కౌసల్య కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి ఉబికి వస్తున్న వరదనీరు



ఓక్షిత ఎన్‌క్లేవ్‌లో కొనసాగుతున్న వరద ఉధృతి

గాజులరామారం డివిజన్ ఓక్షిత్ ఎన్‌క్లేవ్‌లో బుధవారం సైతం వరద ఉధృతి అలాగే కొనసాగింది. చాలా మంది విద్యార్థులను తల్లిదండ్రులు వరద భయంతో స్కూళ్లకు పంపలేదు. కొన్ని ఇళ్లలోకి నీరు వచ్చి చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలనీకి వచ్చే మూడు వైపులా రోడ్ల నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. – సుభాష్‌నగర్

సమస్య తలెత్తితే వెంటనే ఫోన్ చేయండి

- 24గంటలు ప్రజలకు అందుబాటులో అధికారులు
- వర్షాల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచన
- పిల్లలను బయటకు రాకుండా చూసుకోవాలని వినతి
- విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ శ్రీనివానరావు

జీడిమెట్ల: వర్షాల కారణంగా ఎక్కడైనా మ్యాన్‌హోళ్లు తెరచి ఉన్నా.. కరెంట్ తీగలు తెగిపోయినా వెంటనే పోలీసులు, మున్సిపల్ అధికారులకు తెలయజేయాలని బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్షాలు కురిసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాచుపల్లి పీఎస్ పరిధిలో మంగళవారం నాలాలో పడి కొట్టుకుపోయి మృతిచెందిన మిథున్‌రెడ్డి మృతిపట్ల ఆయన సంతాపం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరగడం చాలా బాధాకరమైన విషయమని అన్నారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలకు సూచించారు.

24గంటలు ప్రజలకు అందుబాటులో అధికారులు..

వర్షాల వలన ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తిన టోల్‌ఫ్రీ నం. 100 ద్వారా పోలీస్, మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. భారీ వర్షాల వలన ఇటీవల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని కొన్ని కాలనీల్లో ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని ఇలాంటి సమయంలో అధికారులకు సమాచారం అందిస్తే అధికారులు వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రజలకు సహాయం చేస్తారని తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో ప్రజలు సాధ్యమైనంత వరకు ఇళ్లల్లోంచి బయటకు వెళ్లకపోవడమే ఉత్తమమని ఆయన సూచించారు.

ముంపు ప్రాంతవాసులు జాగ్రత్తగా ఉండాలి..

కుత్బుల్లాపూర్ పరిధిలోని ముంపునకు గురయ్యే కాలనీల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలు ఇళ్లల్లోంచి బయటకు రాకుండా చూసుకోవాలని కోరారు. నాలా పక్కన ఇళ్లు ఉన్న సుభాష్‌నగర్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు కరెంటు స్తంభాలను ముట్టుకోకుండా వారికి తల్లిదండ్రులు తగిన సూచనలు చేయాలన్నారు.

సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధిగా మారాలి



ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన బస్తీ సంక్షేమ సంఘం సభ్యులు

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కాలనీల్లో అభివృద్ధికి సంక్షేమ సంఘాలు వారధిగా మారాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం చింతల్ డివిజన్ శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానికంగా నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బస్తీ అభివృద్ధికి పాటు పడాలన్నారు. అధ్యక్షుడు దాసరి నర్సింగ్ రావు, సెక్రటరీ నాగరాజు తదితరులు ఉన్నారు.

◆ గాజులరామారం డివిజన్ పరిధిలోని దర్గాగడ్డ, చంద్రగిరి నగర్, ఓమర్ ఫారూఖ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి తమ ప్రాంత అభివృద్ధి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు షాదుల్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ షబ్బీర్, సెక్రెటరీ షేక్ అబీబ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ తాహీర్ తదితరులు ఉన్నారు.

బాలుడి మృతి ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అధికారి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ ప్రాంతీయ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: బాచుపల్లి ఎస్‌ఆర్‌ఐ కాలనీలోని డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో బాలుడు కొట్టుకుపోయిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని హైదరాబాద్ ప్రాంతీయ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం బాచుపల్లిలోని ఎస్‌ఆర్‌ఐ కాలనీలో ఆయన పర్యటించారు. బాలుడు వరదనీటిలో కొట్టుకుపోయిన ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తు చర్యగా పాఠశాలలకు సెలవులు ప్రకటించామన్నారు.

వార్డు ఆఫీసర్‌ను సస్పెండ్ చేశాం..

ఎస్‌ఆర్‌ఐ కాలనీలో బాలుడు తెరిచి ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో కొట్టుకుపోయి మృతి చెందడం చాలా బాధాకరమైన విషయమన్నారు. ఇప్పటికే ఈ ఘటనపై విచారణ చేపట్టామని తెలిపారు. సంబంధిత వార్డు ఆఫీసర్‌ను సెస్పెండ్ చేశామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనున్నామని తెలిపారు. దీనికి మీడియా సైతం ప్రజలను చైతన్యం చేసేందుకు సహకరించాలని కోరారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు వరదనీటిలో రాకపోకలకు సాగించవద్దని కోరారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు ఉన్నారు.

నాలాలపై ఆక్రమణలను తొలగించాలి



నిజాంపేట్: చెరువులు, నాలాను కబ్జా చేయడంతోనే కాలనీలు మునుగుతున్నాయని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. బుధవారం ప్రగతినగర్‌లో బాలుడు భూగర్భ డ్రైనేజీ లైన్‌లో కొట్టుకుపోయిన ప్రాంతాన్ని.. అదే విధంగా గాజులరామారంలోని నీట మునిగిన ఓక్షిత ఎన్‌క్లేవ్‌ను సీపీఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రగతినగర్‌లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా బాలుడు కొట్టుకపోయి మృత్యువాత పడ్డాడని తెలిపారు. దీనికి బాధ్యత వహిస్తూ కమిషనర్‌ను డిస్మిస్ చేయాలన్నారు. కబ్జాదారులు చెరువు కట్టుకాలువలు, నాలాను కబ్జాచేశారని, దానికి రెవెన్యూ అధికారుల సహకరించడంతోనే నేడు ఓక్షిత ఎన్‌క్లేవ్‌లో ముంపు సమస్య తలెత్తుతోందని ఆరోపించారు. వెంటనే నాలాపై అక్రమణలను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాచుపల్లి మండల కార్యదర్శి శ్రీనివాస్,కుత్బుల్లాపూర్ మండల సహాయ కార్యదర్శి దుర్గయ్య, కోశాధికారి సదానంద్, కార్యవర్గ సభ్యులు హరనాథ్‌రావ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో తెలంగాణ దేశానికే తలమానికం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: అభివృద్ధి విషయంలో తెలంగాణ దేశానికే తలమానికంగా మారిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు ఆయనను కలిసి స్థానిక సమస్యలపై విన్నవించగా సానుకూలంగా స్పందించారు. సంబంధిత అదికారులతో మాట్లాడి తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని ఆహ్వానం..

◆ బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీలో ఈనెల 12వ నిర్వహించనున్న శ్రీరేణుకాఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. మాజీ సర్పంచ్ డాబా శ్రీను, కుమార్ యాదవ్, గోపాల్ రెడ్డి, బాల్ రెడ్డి, నరేష్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన డిప్యూటీ కమిషనర్..

◆ గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మల్లారెడ్డి బుధవారం ఎమ్మెల్సీని కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ విధుల నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి సంక్షేమ సంఘాల ప్రతినిధులు

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టేలా ఒత్తిడి తేవాలి..

◆ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా కృషి చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాదగిరి మాదిగ, సిలువేరు శ్రీనివాస్‌మాదిగ, రమేష్ మాదిగ, మట్ట నరసింహులు, సలోమి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా సిద్ధం చేస్తున్నాం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు
- సవరణలు ఉంటే చెప్పాలని రాజకీయ పార్టీలకు వినతి

కుత్బుల్లాపూర్: ఓటర్ల జాబితాలో సవరణలపై అభిప్రాయాలను తెలియజేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు అన్నారు. బుధవారం ఆయన ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పక్షాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేస్తున్నామని, త్వరలో వాటిని అందుబాటులో ఉంచుతామన్నారు. కొత్తగా నమోదైన ఓటర్ల జాబితాతో పాటు మార్పులు చేర్పులతో తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. రాజకీయ పార్టీలు బూత్‌ల వారీగా ఏజెంట్లను నియమించుకోవాలని తెలిపారు. ఓటర్ల సవరణపై ఏమైనా ఇబ్బందులుంటే తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశమైన ఎన్నికల అధికారి సైదులు

నిర్మాణ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

చింతల్: మరమ్మతులు చేపట్టే విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్మాణాలు చేపట్టాలని వాటర్ వర్క్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ స్వామి అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని సుచిత్ర సెక్షన్ ఓం బుక్స్ వద్ద చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ మరమ్మతు పనులను బుధవారం కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రమాదాలు తలెత్తే అవకాశముందన్నారు. నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టే ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు రక్షణ చర్యలు తీసుకుని బారికేడ్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. నిర్మాణ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు.



మరమ్మతులను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి

- కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

రంగారెడ్డినగర్: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే గురువులను గౌరవించడం మన సంప్రదాయమని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి అధ్యక్షతన బుధవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన రంగారెడ్డినగర్‌కు చెందిన బ్రైట్ కాన్సెప్ట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వినోద్‌కుమార్ జాదవ్‌కు జిల్లా అదనపు కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి బి.దేవసహాయం, జెడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డిలతో కలిసి మంత్రి మల్లారెడ్డి ప్రశంస పత్రంతో పాటు మెమొంటోను అందజేశారు.

◆ దుండిగల్: మేడ్చల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా దుండిగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణితం ఉపాధ్యాయుడు ఎం.రవీందర్ ఎంపికయ్యారు. ఆయనను బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయులు శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు.

◆ **నిజాంపేట్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన ఎందరో నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ అన్నారు. బుధవారం బాచుపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులను సత్కరించి మెమొంటోలు అందజేశారు.**



వినోద్‌కుమార్ జాదవ్‌కు ఉత్తమ ఉపాధ్యాయ ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



బాచుపల్లి జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కార్పొరేటర్ ఆగం పాండు



గణిత ఉపాధ్యాయుడు రవీందర్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం సత్య నళిని